శాతవాహనులు... సాంస్కృతిక చరిత్ర

శాతవాహనుల యుగ చరిత్ర (క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు) శాతవాహనుల 'యుగం' దక్షిణాపథ రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టింది. వివిధ రంగాల్లో అపారమైన కృషిచేసి, ఉత్తర-దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక వారధిని వీరు నిర్మించారు. దక్షిణాపథంలో శాతవాహనులు సుమారు నాలుగున్నర శతాబ్దాల పాటు రాజకీయ సమైక్యతను, సుస్థిరతను నెలకొల్పారు. శాతవాహన చరిత్రకు సంబంధించి అనేక విషయాలు వివాదాస్పదంగా ఉన్నాయి. అయితే వివిధ సాక్ష్యాధారాల సహాయంతో శాతవాహనుల పాలన క్రీ.పూ. 271లో ఆరంభమై, క్రీ.శ. 174లో అంతమయ్యిందని చరిత్రకారుల అభిప్రాయం. 'ఆంధ్ర శబ్దం' మొదట 'ఐతరేయ బ్రాహ్మణం'లో కన్పిస్తుంది. మత్స్య, వాయు, విష్ణు, భాగవత పురాణాల్లో ఆంధ్రుల ప్రశంస ఉంది. పురాణాలు ప్రస్తావించిన ఆంధ్ర జాతీయులు, శాసనాలు ప్రకటించిన శాతవాహన రాజుల పేర్లు ఒకటిగానే ఉన్నాయి. కొన్ని పురాణాలు ముప్పై మంది ఆంధ్ర రాజులు సుమారు నాలుగున్నర శతాబ్దాలు పాలించినట్లు చెబుతున్నాయి. కొన్ని పురాణాలు ఆంధ్రులను 'ఆంధ్ర భృత్యులని' పేర్కొన్నాయి. మొదట మౌర్య సామ్రాజ్యంలో సేవకులు(భృత్యులు)గా ఉన్న ఆంధ్రులు తర్వాత స్వతంత్రులై రాజ్యాన్ని స్థాపించారు. అందువల్ల ఆంధ్రభృత్యులుగా వర్ణించారని కొంతమంది చరిత్రకారుల వాదన. ఇంతవరకు లభించిన ఆధారాలు ప్రకారం- క్రీ.శ. 230 ప్రాంతానికి 'శాతవాహన యుగం' అంతరించినట్లు తెలియజేస్తున్నాయి. మెగస్తనీసు సంకలనం చేసిన 'ఇండికా' ప్రకారం ఆంధ్రులకు 30 ప్రాకారాలున్న కోటలున్నట్లు తెలుస్తుంది. అమరావతి ప్రాంతంలో దొరికిన 'అశోకుని స్తంభశాసనం' ఎర్రగుడి, రాజుల మందగిరి (కర్నూలు), మస్కి ప్రాంతాల్లో లభించిన శిలాశాసనాలు మౌర్యుల పాలనకు నిదర్శనాలు. అమరావతి స్తూప నిర్మాణ తొలిదశలో నిర్మించిన రాతికంచె మౌర్యుల కాలం నాటి పనితనాన్ని ప్రదర్శిస్తుంది. శాతవాహనులు గోదావరి, కృష్ణా మండల ప్రాంతాన్ని, తర్వాత పశ్చిమాన నాసిక్ వరకూ రాజ్య విస్తరణ చేశారు. అశోకుని శాసనాలు అతని రాజ్యంలో రథికులు, భజకులు, పుళిందులు, కళింగులు, ఆంధ్రులను సామంత తెగలుగా పేర్కొంటున్నాయి. శాతవాహనులు ప్రాచీన రాజధాని 'శ్రీకాకుళం'(కృష్ణా జిల్లా) అని, ఆ తర్వాత ధాన్యకటకమని, ఆ తర్వాత పశ్చిమ తీరంలో ప్రతిష్ఠానపుర మని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

అశోకుని పాలనాంతరం మౌర్య సామ్రాజ్య అంతర్భాగమైన అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. మౌర్యుల కింద పనిచేసిన రాజోద్యోగులు స్వతంత్రించి పాలించినట్లు నాణేల ఆధారంగా తెలుస్తోంది. మహారథులు, మహా తలవరులు, మహా గ్రామికులు, మహా సేనాపతులు, కురులు, ఆనందులు, సేబకులు తెలంగాణా ప్రాంతంలో నాణేలు జారీ చేశారు. మొదటి శాతకర్ణి 'మహారథి త్రణయిక' కుమార్తె, నాగనికను వివాహమాడి, తన రాజ్యాన్ని సుస్థిరం చేసికొన్నట్లు శాసనపరమైన ఆధారం ఉంది.

ఆధారాలు

శాతవాహనుల చరిత్రకు ప్రధానమైన ఆధారాలు, మత్స్య, వాయు, బ్రహ్మాండ, భాగవత పురాణాలని చెప్పవచ్చు. సంస్కృత భాషలో శర్వవర్మన్ రాసిన కాతంత్ర వ్యాకరణం, గుణాఢ్యుడు రచించిన బృహత్కథ, హాలుని 'గాథా సప్తశతి' ఆచార్య నాగార్జుని గ్రంథాలు ముఖ్య ఆధారాలుగా ఉన్నాయి. విదేశీ రచనలు... గ్రీకు రచయిత మెగస్తనీసు 'ఇండికా', టాలమీ 'ఎ గైడ్ టు జాగ్రఫీ', హ్యూయాన్‌త్సాంగ్ రచించిన సి-యూ-కీ, ప్లినీ రచనలు, 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ' (అజ్ఞాత రచయిత) గ్రంథాలతో పాటు, పురావస్తు తవ్వకాల్లో లభించిన నాణేలు, ప్రతిమలు, శాసనాలు ప్రధాన ఆధారంగా ఉంటున్నాయి. **ఉదా:** ఆంధ్రదేశంలో అశోకుని శిలా శాసనాలు మస్కి, రాజుల మందగిరి, ఎర్రగుడి ప్రాంతాల్లో లభించాయి. అదేవిధంగా పశ్చిమ ప్రాంతాలైన నాసిక్, కన్హేరి, కార్లే గుహల్లో లభించిన 'రాణీ నాగనిక' వేయించిన 'నానాఘాట్ శాసనం', గౌతమీ బాలశ్రీ వేయించిన 'నాసిక్ శిలాశాసనం', శాతవాహనుల సమకాలికుడైన కళింగాధిపతి ఖారవేలుడు వేయించిన 'హాతీగుంఫా శాసనం' ఒరిస్సా (ఉదయగిరి కొండల్లో వేశాడు), రుద్రదమనుని 'గిర్నార్ శాసనం' మొదలైనవి శాతవాహనుల చరిత్రకు మూలాధారాలుగా ఉన్నాయి. వీరి కాలంనాటి బంగారు, వెండి, తగరపు నాణేలు, బౌద్ధ అవశేషాలైన స్తూపాలు, చైత్యగృహాలు, విహారాలు ఆ కాలం నాటి సాంఘిక పరిస్థితులకు అద్దం పడతాయి.

సిముకుడు (క్రీ.పూ. 271-248)

శాతవాహన వంశ స్థాపకుడు సిముకుడు. క్రీ.పూ. 271 నుంచి 248 వరకు 23 సంవత్సరాలు పాలించాడు. ఇతడు మొదట మౌర్యుల ఆధిపత్యాన్ని అంగీకరించి, రాజకీయ జీవితాన్ని ఆరంభించినట్లు కన్పిస్తుంది. సిముకుడు మహారాష్ట్ర రాజకుమారి 'నాగనిక'ను తన కుమారుడు మొదటి శాతకర్ణికిచ్చి వివాహం చేశాడు. ఈమె నాసిక్ గుహలో వేయించిన 'నానాఘాట్' శాసనంలో సిముకుని ప్రస్తావన ఉంది. ఇతడు పుళిందులు, భోజకులు, పిటినికులు మొదలైన జాతులవారిని ఓడించాడు. సిముకుడు మొదట జైన మతస్థుడు. చివరి రోజుల్లో క్రూరుడుగా మారి, భ్రష్టుడై, హతుడైనట్లు జైన గాథల వల్ల తెలుస్తుంది. సిముకుడు జారీ చేసిన నాణేలు విరివిగా తెలంగాణా ప్రాంతంలోని కోటిలింగాల (కరీంనగర్ జిల్లా), సంగారెడ్డి, కొండాపురం, మహారాష్ట్రలోని నెవాసా, జున్నార్, అకోలా, మరట్వాడాలోని కొన్ని ప్రాంతాల్లో కర్ణాటకలోని 'సన్నతి' వద్ద విరివిగా లభించాయి. దీనిని బట్టి తొలి శాతవాహనుల రాజ్య విస్తరణ తెలంగాణా ప్రాంతంలో ప్రారంభమై, మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక ప్రాంతాలకు విస్తరించినట్లు తెలుస్తుంది.

కాన్హ (కృష్ణుడు) క్రీ.పూ. 248-230

సిముకుని తర్వాత అతని సోదరుడు 'కాన్హ' (కృష్ణ) 18 సంవత్సరాలు పాలించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇతని కాలంలోనే రాజధాని జున్నార్ ప్రాంతానికి మారినట్లుగా నానాఘాట్ గుహ శాసనం తెలియ జేస్తుంది. ఇతని మరణానంతరం 'సిముకుని' కుమారుడు మొదటి శాతకర్ణి సింహాసనం అధిష్టించాడు. కృష్ణుని కాలంలో నాసిక్‌లో బౌద్ధ గుహలు తొలిపించినట్లు నాసిక్ శాసనం విశదపరుస్తోంది.

మొదటి శాతకర్ణి (క్రీ.పూ. 230-220)

ఇతడు సిముకుని కుమారుడు. శాతవాహనుల్లో మూడవ రాజు. ఇతని పాలనాకాలం పది సంవత్సరాలే అయినా, అది దక్షిణా పథ చరిత్రలో ముఖ్యమైంది. ఇతని భార్య'నాగనిక' వేయించిన నానాఘాట్ శాసనం రాతిమీద సిముకుడు, మొదటి శాతకర్ణి, నాగనిక, తదితర రాజకుమా రుల బొమ్మలను చెక్కారు. శాసనంలో ఇతన్ని ఏకవీరుడని, 'శూరు డని', 'దక్షిణా పథపతి' అని వర్ణించారు. ఈ బిరుదులు ఇతని పరాక్ర మాన్ని సామ్రాజ్య విస్తరణను సూచిస్తున్నాయి. ఇతడు పశ్చిమ మాళ్వా ప్రాంతాన్ని, ఉజ్జయిని 'విదిశ' వరకు విస్తరించాడు. 'అప్రతిహత చక్ర' అనే బిరుదు ఉంది. నానాఘాట్ శాసనం ప్రకారం - ఇతడు యజ్ఞాలు, యాగాలు,వైదిక క్రతువులు జరిపి, బ్రాహ్మణులకు గోవులు, గుర్రాలు, ఏనుగులు, గ్రామాలు దానం చేసినట్లు తెలుస్తోంది. ధనరూపంలో వెండి నాణేలు 'కార్షాపణలు' బ్రాహ్మణులకు దానం చేశాడు. అశ్వ మేధ, రాజసూయ యాగాలు నిర్వహించి, రాజ్యాన్ని సుస్థిరం చేశాడు. రెండు అశ్వమేధ యాగాలు, ఒక రాజసూయాగం చేసిన తొలి శాత వాహన రాజు మొదటి శాతకర్ణే.

రెండో శాతకర్ణి (క్రీ.పూ. 184-128)

శాతవాహన వంశంలో ఆరో రాజు. 56 సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. కణ్వ వంశంలో ఆఖరివాడైన సుశర్మను ఓడించి, పాటలీపు త్రాన్ని జయించాడు. శుంగుల నుంచి మాళ్వాను జయించాడు. ఇతడు రథికుల్ని (మహారాష్ట్రులు), బీరారులోని భోజులను జయించాడు. ఇత ని కాలంలోనే కళింగాధిపతి-ఖారవేలుడు వేయించిన 'హతీగుంఫా శాసనం'లో తన 11వ రాజ్య సంవత్సరంలో 'పిథుండ' నగరాన్ని నాశ నం చేసినట్లు చెప్పుకున్నాడు. పిథుండ నగరం గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలుగా గుర్తించారు. ఇతడు విదేశీయులైన శక, యవన, పహ్లవు లను అణచివేశాడు. ఖారవేలుని చేతిలో ఓడిపోయినట్లు తెలుస్తుంది. ఖారవేలుని మరణానంతరం ఇతడు కళింగను జయించాడు. పశ్చిమ మాళవ రాజ్యాలైన అవంతి, ఆకర స్వాధీనం చేసుకున్నాడు. శక, మగధ రాజ్యాలను జయించాడు. మగధపై ఆధిపత్యం వహించిన దక్షి ణాపథ రాజులలో రెండో శాతకర్ణి ప్రథముడు.

కుంతల శాతకర్ణి

శాతవాహన రాజులలో 13వ వాడు. మాళ్వా, మహారాష్ట్ర ప్రాంతాలను శకుల నుంచి స్వాధీనం చేసుకున్నాడు. ఇతని కాలంలోనే ప్రాకృత భాష స్థానంలో సంస్కృతం రాజభాష అయింది. తాను జారీచేసిన నాణేలపై 'పాటలీపుత్ర' చిహ్నాన్ని ముద్రించాడు. ఇతని ఆస్థానంలోని శర్వవర్మన్ కాతంత్ర వ్యాకరణాన్ని, గుణాఢ్యుడు బృహత్కథను రాశారని ప్రతీతి. వాత్సాయనుని 'కామసూత్ర'లో ఈ రాజు ప్రస్తావన ఉంది.

ఆంధ్రుల చరిత్ర - బిట్స్

1. 'ఆంధ్రశబ్దం' మొట్టమొదటిసారిగా ఈ బ్రాహ్మణంలో ప్రస్తావించారు?

ఎ) తైత్తరీయ బ్రాహ్మణంలో బి) జైమినీయ బ్రాహ్మణంలో
సి) శతపథ బ్రాహ్మణంలో డి) ఐతరేయ బ్రాహ్మణంలో

2. 'అశోకుని శిలాస్తంభ శాసనాలు' ఆంధ్రదేశంలో ఈ జిల్లాలో బయటపడ్డాయి?

ఎ) కర్నూలు బి) విశాఖపట్నం
సి) మెదక్ డి) కరీంనగర్

3. కళింగాధిపతి ఖారవేలుడు కింది శాసనాన్ని క్రీ.పూ.161లో వేయించాడు?

ఎ) గిర్నార్ శాసనం బి) హాతీ గుంఫా శాసనం
సి) నానాఘాట్ శాసనం డి) నాసిక్ శాసనం

4. శాతవాహన రాజ్య స్థాపకుడెవరు?

ఎ) యజ్ఞశ్రీ శాతకర్ణి బి) గౌతమీపుత్ర శాతకర్ణి
సి) సిముకుడు డి) శివస్కంధుడు

5. సిముకుని నాణాలు ఆంధ్రదేశంలో ఇక్కడ లభించాయి?

ఎ) సన్నతి బి) మస్కి సి) గుంటూరు
డి) కోటిలింగాల (కరీంనగర్ జిల్లా)

6. సిముకుడు, మొదటి శాతకర్ణి, నాగనిక ప్రతిమలను ఏ శాసనంలో మలిచారు?

ఎ) దేవీ నాగనిక వేయించిన నానాఘాట్ శాసనంలో
బి) గౌతమీ బాలశ్రీ - నాసిక్ శాసనంలో
సి) రుద్రదమనుని గిర్నారు శాసనంలో
డి) ఖారవేలుని హాతీగుంఫా శాసనంలో

7. 'దక్షిణా పథపతి' బిరుదు ఏ శాతవాహన రాజుకుంది?

ఎ) మొదటి శాతకర్ణి బి) గౌతమీపుత్ర శాతకర్ణి
సి) రెండో పులోమావి డి) హాలుడు

8. 'కార్షాపణులు' అంటే ఏమిటి?

ఎ) గోవులు బి) స్తూపాలు
సి) గృహాలు డి) వెండి నాణేలు

9. కణ్వవంశంలో చివరివాడైన సుశర్మను ఓడించి పాటలీపుత్ర నగరాన్ని ఏ శాతవాహన రాజు జయించాడు?

ఎ) మొదటి శాతకర్ణి బి) రెండో శాతకర్ణి
సి) గౌతమీపుత్ర శాతకర్ణి డి) యజ్ఞశ్రీ శాతకర్ణి

సమాధానాలు

1)డి 2)ఎ 3)బి 4)సి 5)డి
6)ఎ 7)ఎ 8)డి 9)బి